ప్రజాశక్తి
గురువారం 25 జులై 2024
5
పార్వతీపురం మన్యం

'జంఝావతి'కి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి కొమరాడ

రాష్ట్ర బడ్జెట్‌లో జంఝావతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జంఝావతి ప్రాజెక్టును ఏళ్ల తరబడి పూర్తిచేయకపోవడంతో రైతులకు సరిగా సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కూటమి నాయకులు రిజర్వాయర్‌ను పరిశీలించారని, అనంతరం కమిటీ వేసి ప్రాజెక్టును పూర్తిచేస్తామన్న సందేశాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. వెంటనే బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చించి, నిధులు కేటాయించి, ప్రాజెక్టు పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో ఎపి రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

తుప్పలతో నిండిన తూడి సాగునీటి కాలువ

పాలకుల నిర్లక్ష్యం, అధికారులు ముందుచూపు లేమి రైతుల్ని పట్టిపీడిస్తున్నాయి. గ్రహణంలా పట్టిపీడిస్తూ ఏళ్ల తరబడి నష్టాల పాల్జేస్తున్నాయి. సాగునీటి కోసం ఏటా వర్షాల కోసం ఎదురుచూసేలా చేశాయి. 'దేశానికి వెన్నెముక రైతే... రైతును రాజును చేస్తాం... అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటామ'ంటూ పాలకులు ఉపన్యాసానికే పరిమితం అవుతున్నారు తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. ఈ కారణంగా ప్రతి ఏటా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

సాగు కష్టమే?

- శివారు గ్రామాలకు అందని సాగునీరు
- ఏటా వరుణుడిపైనే రైతుల ఆశలు
- ప్రకటనలకే పరిమితమవుతున్న పాలకులు
- ఇదీ వీరఘట్టం మండలంలో సాగునీటి దుస్థితి

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం మండలంలోని నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ, పివిఆర్ పురం, డిపివలస, తదితర గ్రామాలకు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరు రావాల్సి ఉంది. శివారు ప్రాంతాలు కావడంతో గ్రామాలకు వచ్చేసరికి అడుగు నీరు కూడా రాకపోవడంతో అన్నదాతలు సాగునీటి కోసం ఆరాటం పడుతున్నారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ నుండి మొదటి ఛానల్ ద్వారా రావివలస నుండి కడకల్లా, నడిమికెల్లా, విక్రంపురం, చిట్టిపూడివలస, నడుకూరు, కిమ్మి, కొట్టు గుమ్మడ, శివారు ప్రాంతమైన గడగమ్మ గ్రామం వచ్చేసరికి అడుగు నీరు కూడా రావడం లేదు. గడగమ్మ గ్రామానికి సాగునీరు రావాలంటే పైన ఉన్న గ్రామాల్లో ఉబాలు పూర్తికావాలి. అప్పటి వరకూ నీరురాదు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్లతోపాటు పంటను సాగు చేసుకునేందుకు సాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని ఆర్భాటంగా ప్రచారాలకు పరిమితం అవుతున్నారే తప్ప సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారైన గడగమ్మ పిల్ల కాలువ

బోర్లే ఆధారం

దాదాపుగా మూడు దశాబ్దాల నుంచి తమ గ్రామాలకు సాగునీరు సక్రమంగా రాకపోవడంతో బోర్లపైన ఆధారపడి పంటలు సాగు చేయాల్సి వస్తోందని రైతులు ఆర్.వెంకటరమణ, అశోక్, ఆర్.శ్రీను, ఎం.వరలక్ష్మి, అన్నంనాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. బోర్ల అవకాశం లేని రైతులు వర్షాల ఆధారంగానే పంటలు సాగుచేస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నా అనుకున్న సమయాల్లో వర్షాలు కురవకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో రైతులకు బదులు కూలీలుగా మారవలసిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పివిఆర్ పురం గ్రామానికి 11 బ్రాంచ్ హుస్సేనపురం నుండి పిల్ల కాలువ ద్వారా తూడి మీదుగా రావాల్సిన సాగునీరు రాకపోవడంతో వరుణుడిపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులు పూర్తయితే ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోచ్చనని గత పాలకులు ప్రకటించినా ఒక్క పంటకూ నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ఆధునీకరణ పనులు ప్రారంభం కాకముందు పాత ఆయకట్టు ద్వారా గ్రామాలకు పుష్కలంగా సాగునీరు అందేదని, ఆ పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

వైద్యారోగ్య శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జ్వరం కేసు నమోదైతే

ఊరంతా పరీక్షించాల్సిందే

వైద్యారోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గ్రామంలో జ్వరం కేసు నమోదైతే, ఆ ఊరిలో ప్రతి వ్యక్తినీ పరీక్షించాల్సిందేనని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ప్రతి కేసును క్షుణ్ణంగా విచారణ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు ఎక్కడా నమోదు కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పద కేసులు ఉన్నా అన్ని పరీక్షలు చేసి మంచి వైద్యాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. వైద్య అధికారులు తమ క్షేత్ర స్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. సీతంపేట, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాల్లో మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జ్వరాల సర్వే నిరంతరం సాగాలని, మందులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఒక్క మరణం కూడా సంభవించరాదన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత సీజన్ లో వైద్య అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిబ్బంది సేవలను ప్రణాళికాబద్ధంగా పక్కాగా వినియోగించుకోవాలని చెప్పారు. అవసరం మేరకు మైదాన ప్రాంతాల నుంచి గిరిజన ప్రాంతాలకు సిబ్బందిని డిప్యూట్ చేయాలని ఆదేశించారు. కీటకాల (వెక్టార్) ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టాలని సూచించారు.

పిల్లల నుండి పెద్దల వరకు రక్తహీనత సమస్య కనిపిస్తుందని, ఎక్కడా రక్త హీనత నివారణ, మాత, శిశు మరణాలు జరగకూడదని కలెక్టర్ ఆదేశించారు. సామాజిక కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలని, పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గర్భిణుల నమోదులో జాప్యం వద్దన్నారు. మాదలంగి, దుడ్డుకల్లు, మర్రిపాడు, తగితర పిహెచ్‌సిల పరిధిలో రక్త హీనత నివారణకు మరింత కృషి చేయాలన్నారు. పిహెచ్‌సిలకు గ్రేడింగ్ ఇవ్వాలని ఆదేశించారు. ఆధార్ శిబిరాలు జరుగుతున్నాయని, వాటిలో ప్రజల వివరాలు సరిదిద్దుకోవచ్చని, తద్వారా ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదులో ఇబ్బందులు లేకుండా చేయవచ్చని తెలిపారు. ప్రతి నెలా మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, వైద్య అధికారులు సమన్వయం చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయపార్వతి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి నారాయణ రావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ శివ కుమార్, ప్రోగ్రాం అధికారులు ఎం.వినోద్, టి.జగన్మోహనరావు, వైద్య అధికారులు, పి హెచ్ సి వైద్యులు పాల్గొన్నారు.

రెండో రోజుకు సిఆర్‌టిల దీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

తమను రెన్యువల్ చేయాలని పార్వతీపురం ఐటిడిఎ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన సిఆర్‌టిలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, సిఆర్‌టిల సంఘం నాయకులు త్రినాథరావు మాట్లాడుతూ ఈ ఏడాది రెన్యువల్స్‌లో జిపిఎస్ పాఠశాలలో పదిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒక సిఆర్‌టినీ కేటాయించలేదన్నారు. పాఠశాలలు తెరిచి 40 రోజులు కావస్తున్నా ఏ ఒక్క టీచర్ లేకపోవడం చాలా దారుణన్నారు. దీనిపై సోమవారం రాత్రి 12 గంటల వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టినా అధికారుల నుండి ఎలాంటి స్పందనా లేదన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితులలో మంగళవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. సిఆర్‌టిల నియామకంలో ప్రభుత్వానికి లేని అభ్యంతరాన్ని ఐటిడిఎ అధికారులు వ్యక్తం చేయడమేమిటని ప్రశ్నించారు. దీన్ని పరిశీలిస్తే చూస్తే సిఆర్‌టిల నుంచి ఆర్థికంగా ఏదో ఆశించినట్లు అర్థమవుతోందని, అలాంటి చర్యలను ఖండిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దీక్షా శిబిరంలో కూర్చున్న సిఆర్‌టిలు

నైపుణ్య శిక్షణలేక

వైటిసి వెలవెల

- గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే ప్రాధాన్యత
- మంత్రి సంధ్యారాణి పూర్వ వైభవం తీసుకొస్తారా?

ప్రజాశక్తి-సాలూరు

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన ధ్యేయంగా టిడిపి ప్రభుత్వ హయాంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి)ని ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా నైపుణ్య శిక్షణ తరగతులు లేక వైటిసి వెలవెలబోతోంది. గడచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం హయాంలో ఒక్క నైపుణ్య శిక్షణ కార్యక్రమం కూడా జరగలేదు. దీంతో పట్టణంలోని గుమడాంలో నెలకొల్పిన వైటిసి గిరిజన గర్భిణుల వసతిగృహానికే పరిమితమైంది. రెండు అంతస్తులలో నిర్మించిన వైటిసిలో టిడిపి ప్రభుత్వ హయాంలో అనేక ఉపాధి శిక్షణ తరగతులు జరిగాయి. గిరిజన యువతకు కంప్యూటర్, హోటల్ మేనేజ్‌మెంట్, టైలరింగ్, ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతకు వివిధ ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు. 2014 నుంచి 2019 వరకు గిరిజన యువతకు ఉపాధి శిక్షణ తరగతుల నిర్వహణతో వైటిసి కళకళలాడుతుండేది.

మన్యం జిల్లాలో సాలూరు, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురంల్లో వైటిసిలు ఏర్పాటు చేశారు. గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వీటిని గత టిడిపి ప్రభుత్వం నెలకొల్పింది. నిత్యం ఏదో ఒక నైపుణ్య శిక్షణ నిర్వహించేలా ఈ ప్రాంతాల్లో వైటిసిలను ప్రారంభించారు. ప్రస్తుతం సాలూరు, గుమ్మలక్ష్మీపురంల్లో మాత్రమే వైటిసిలు ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు తర్వాత జిల్లా కేంద్రంలోని వైటిసి భవనంలో ఎస్‌పి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు మిగిలిన రెండు వైటిసిలలోనూ ఉపాధి అవకాశాలు కల్పించే శిక్షణ తరగతులు లేక నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కో వైటిసిలో పది మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి నెలనెలా వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగాలు వదల్లేక చిత్తశుద్ధితో పని చేయలేక సతమతమవుతున్నారు.

సాలూరులో నిరుపయోగంగా ఉన్న వైటిసి భవనం

మంత్రి దృష్టి పెడతారా?

వైటిసిలలో ఉపాధి శిక్షణ తరగతులు నిర్వహించడంలో గత వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడి ఉన్న గిరిజన నియోజకవర్గంలో ఎక్కువమంది గిరిజన యువకులు పది, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువులతో ఆపేసి ఖాళీగా ఉంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక, ప్రయివేటు ఉద్యోగానికి వెళ్లడానికి తగిన నైపుణ్యం లేక నిరుద్యోగ యువకులు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారు. నాటుసారా తయారీ, విక్రయాలలో మునిగిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వైటిసికి పూర్వవైభవం వస్తుందనే ఆశతో గిరిజన యువకులు ఎదురు చూస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రత్యేక దృష్టిసారించి గిరిజన యువతకు ఉపాధి శిక్షణ తరగతులు నిర్వహించేలా చూస్తారని భావిస్తున్నారు.

వసతిగృహ విద్యార్థులకు

వైద్య సదుపాయాలు కరువు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో వైద్య సదుపాయాలు కరువయ్యాయని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిత్యం గమనించేందుకు ఎఎన్‌ఎంలను నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోశాధికారి అఖిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రావికోన ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న రాఘవ అనే విద్యార్థి మృతి చెందంతో ఆ పాఠశాలను బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ బృందం సందర్శించింది. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి చనిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఇదే సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ రావికోన గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెరుగైన భోజన, తాగునీరు సదుపాయం కల్పించకపోవడం విద్యార్థులకు అనారోగ్య కారణాలుగా చెప్పొచ్చున్నారు. గిరిజన విద్యార్థులు ఎంతోమంది మృతి చెందినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్‌ఎఫ్‌ఐ టౌన్ కార్యదర్శి జి.సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యం బారినపడి మృతి చెందుతున్నా, ఉన్నతాధికారులు, పాలకుల్లో స్పందన లేకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థులు చనిపోతున్నా వారికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. తక్షణమే ప్రతి ఆశ్రమ పాఠశాలకు, గిరిజన సంక్షేమ హాస్టల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దోమతెరలు పంపిణీ చేయాలని, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు సింహాచలం, డేవిడ్, శారద పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

26న బహిరంగ వేలం

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం మున్సిపల్ ఆస్తులకు సంబంధించి తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్దనున్న కొబ్బరి, మామిడి, జీడి చెట్ల ఫలసాయాన్ని మూడేళ్లపాటు పొందేందుకు ఈనెల 26న వేలం వేస్తున్నట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రూబేను దిబ్బ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.లక్ష సాల్వెన్సీ ధ్రువపత్రంతోపాటు రూ.75 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

టెండర్లు వాయిదా

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ పరిధిలో గురుకులాలు, పాఠశాలలు, కళాశాలలకు కూరగాయలు కోడిగుడ్లు, చికెన్ సరఫరా చేయడానికి ఈ నెల 25న టెండర్లు పిలవాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. టెండరుదారులు గమనించాలని కోరారు.

అగ్నిమాపక కేంద్రానికి నిధులు కేటాయించాలి

మంత్రి అనితను కోరిన ఎమ్మెల్యే జయక్రిష్ణ

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండలో అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ బుధవారం అమరావతిలో హోంమంత్రి అనితను కోరారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన అగ్నిమాపక కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని వివరించారు. పాలకొండతో పాటు సీతంపేట, వీరఘట్టం మండలాలకు ఈ కేంద్రమే దిక్కని, అలాంటి కేంద్రానికి సరైన భవనం లేదని చెప్పారు. వెంటనే నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు



హోంమంత్రి అనితకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే జయక్రిష్ణ

ఆకతాయిల ఆగడాలను అరికట్టండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో ఆకతాయిల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు గొర్లి వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు ఎస్‌పి మాధవరెడ్డిని బుధవారం వారు కలిసి ఫిర్యాదుచేశారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలల వద్ద కొందరు ఆకతాయిలు విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. మాయమాటలు చెప్పి వారిని తీసుకుపోయి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్నారన్నారు. ఈ విషయమై ఆయా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కొంతమంది ఆకతాయిలు ద్విచక్ర వాహనాలతో పట్టణ మెయిన్ రోడ్డులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నారన్నారు. జిల్లాలో గంజాయి, నాటు సారా రవాణా, అమ్మకాలను నియంత్రించాలని కోరారు. ఎస్‌పి మాధవరెడ్డి స్పందిస్తూ తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వర్షాలకు కూలిన గోడ

కూలిన ఇంటి గోడ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని వంగర గ్రామంలో కొండగొర్రి రుకునమ్మ అనే గిరిజన వృద్ధురాలి ఇంటిగోడ కూలిపోయింది. ఆమె ఒంటరిగా జీవిస్తోంది. గోడ కూలే సమయంలో ఆమె అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎటువంటి ఆదాయం, ఎవరి ఆదరణ లేక కేవలం పింఛను సొమ్ముతోనే జీవిస్తున్నట్లు ఆమె తెలిపారు.. అధికారులు స్పందించి తన ఇంటి నిర్మాణానికి న్యాయం చేయాలని కోరారు.

పేదల వ్యతిరేక బడ్జెట్

ప్రజాశక్తి-సాలూరు

ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ బడ్జెట్ పేదలు, గిరిజనుల వ్యతిరేక బడ్జెట్ అని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంప ప్రకాశరావు అన్నారు. బుధవారం ఆయన కేంద్ర బడ్జెట్ పై మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌లకు, బడాబాబులకు అనుకూలంగా ఉందన్నారు. దళిత, గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యత లేదన్నారు. ఇప్పటికే ఎపి అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, మరో 15 వేల కోట్లు అప్పుగా కేంద్రం ఇవ్వడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని చెప్పారు. అప్పులెంత ఎక్కువగా ఉంటే ప్రజలపై భారం అంత ఎక్కువగా పడుతుందని తెలిపారు. రూ.15 వేల కోట్ల అప్పుని చూపించి ఏదో సాధించినట్లు టిడిపి, జనసేన నాయకులు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

సీతాఫలాలు విక్రయిస్తున్న గిరిజనులు

సీతాఫలాలకు భలే గిరాకీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో జులై నుంచి సెప్టెంబర్ వరకు దొరికే సీతాఫలాలకు డిమాండ్ పెరిగింది. గిరిజనులు పండించే అటవీ పలసాయాల్లో ఒకటైన సీతాఫలాలు గిరిజనుల ఆదాయ వనరుగా మారాయి. సీతాఫలాలను వారపు సంతలకు, బహిరంగ మార్కెట్లకు తెచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. ఒక్కొక్క బుట్టలో 60 నుంచి 80 వరకు సీతాఫలాలు ఉంటాయి. వీటి ధర రూ.400 నుంచి రూ.500 వరకు పలుకుతోంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట, సాలూరు ఏజెన్సీ ప్రాంతాల్లో సీతాఫలాలను గిరిజనులు ఎక్కువగా పండిస్తుంటారు. సీతాఫలం ఆరోగ్య ప్రదాయినిగా భావిస్తుంటారు.

అక్రమంగా సర్వేరాళ్ల తరలింపు

ప్రజాశక్తి-వీరఘట్టం

భూముల రీసర్వేలో భాగంగా హద్దులకు గుర్తుండేలా అప్పట్లో సర్వేరాళ్లు కూడా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే వీటిని కొంతమంది దొంగిలించుకు పోతున్నారు. ఇదే విధంగా బుధవారం గుర్తుతెలియని వ్యక్తి ఆటోలో సర్వేరాళ్లను ఎక్కించుకుని వెళ్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. వాటిని పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మండల కేంద్రంలోని సచివాలయం-1 వద్ద గురువారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్ తెలిపారు. పుట్టిన పిల్లలకు ఆధార్ నమోదు, ఆధార్‌లో పేర్లు సవరణ, అడ్రస్ మార్పులు తదితర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న నైరా విద్యార్థులు

కెవికెను సందర్శించిన నైరా విద్యార్థులు

ప్రజాశక్తి - కురుపాం

రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను, డెమో యూనిట్లను శ్రీకాకుళం జిల్లాలోని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి కెవికెలో అందిస్తున్న సేవలపై సమన్వయకర్త డాక్టర్ కె.సన్యాసిరాజు వివరించారు. క్షేత్ర పరిశీలనలో రైతులకు, యువతకు అందిస్తున్న శిక్షణ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెవికె సిబ్బంది పాల్గొన్నారు .

కలుపు నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని జయపురంలో కలుపు నివారణపై బుధవారం సిపిఎఫ్ పిఒ సాయి నితీష్ రైతులకు అవగాహన కల్పించారు. వరిలో వరుస పద్ధతిలో నాట్లు వేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ సంతోష్, క్లస్టర్ కోఆర్డినేటర్ సంగమేష్, శ్యామలరావు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ భానుమూర్తి

భవిత కేంద్రాన్ని సందర్శించిన కోఆర్డినేటర్

ప్రజాశక్తి-మక్కువ

మక్కువలోని భవిత కేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్ పెంట భానుమూర్తి బుధవారం సందర్శించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ పెంట సత్యనారాయణ, ఫిజియోథెరపిస్టు సురేష్, ప్రత్యేక ఉపాధ్యాయులు శైలజ, రవికుమార్ పాల్గొన్నారు.

అచ్చపువలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని అచ్చపువలసలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ జ్వర పీడితులతోపాటు వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం అర్జునరావు కృషి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన హక్కుల కోసం అహర్నిశలు కృషిచేసిన మండంగి అర్జునరావు ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు అన్నారు. అర్జునరావు మూడో వర్ధంతిని గొటివాడలో ఆయన స్థూపం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంపటాపు భారతి, గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, కూరంగి గోపి నాయుడు పాల్గొన్నారు.

చీఫ్‌విప్ పదవితో పార్టీ బలోపేతం

ప్రజాశక్తి-భోగాపురం

ఎమ్మెల్యే లోకం మాధవికి జనసేన పార్టీ చీఫ్‌విఫ్ పదవి ఇవ్వడం వల్ల పార్టీ మరింత పుంజుకుంటుందని ఆ పార్టీ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. భోగాపురంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపతం చేస్తారని ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ ఆమెకి ఈ పదవి ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతో బాగుందని, మన రాష్ట్రానికి రాజధాని కోసం అమరావతికి నిధులు కేటాయించడం వల్ల రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఉన్న నమ్మకంతోనే కేంద్రం నిధులను మంజూరు చేసిందని అన్నారు. గూడెపువలస గ్రామ సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేకు పార్టీ చీఫ్ విఫ్ పదవి ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. విమానాశ్రయం నుంచి వస్తున్న వరదనీరు బయటికి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి కృషి

కలెక్టర్ శ్యామప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ప్రాంతాలలో పశుసంపద అధికంగా ఉంది, ప్రకృతి వ్యవసాయం పండించేందుకు ఎక్కడ ప్రజలు ఆసక్తి చూపుతున్నారు, ప్రకృతి వ్యవసాయ సాగుకు సానుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఎరువులు, రసాయనిక మందుల వినియోగం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం పండించే విధంగా కృషి చేయాలన్నారు. ఏ రకమైన ఎరువులు, రసాయన మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటల ఉపయోగాలను ప్రజలకు తెలియాలన్నారు. కరపత్రాలు, పుస్తకాలు, వీడియోలు ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగును పెంచేందుకు ప్రజలలో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. చిరుధాన్యాలు సాగు, ఉపయోగం కూడా ప్రచారం చేయాలన్నారు. ఆర్గానిక్ స్టాల్స్, ప్రాసెసింగ్ యూనిట్స్, ఎఫ్‌బిఎ ఉత్పత్తుల స్టాల్స్ లేదా ఇతర మార్గాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ఖాళీగా ఉన్న ప్రభుత్వం స్థలాల్లో కిచెన్ గార్డెన్ తగ్గట్టుగా ముందుస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఐరన్ సమృద్ధిగా ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. కౌలురైతుల రుణ దరఖాస్తు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. రైతు సమస్యలను పరిష్కరించడానికి వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. రైతులకు ఎటువంటి నష్టమూ కలగకుండా వర్షా కాలానికి

ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్, ఇన్‌ఛార్జి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాధాకృష్ణ, నాబార్డు డిడి ఎం.దినేష్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, ఎన్‌జిఒ ప్రతినిధులు, ఎపిసిఎన్ఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజలాలను తాగండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

డాక్టర్ సంతోష్

వాతావరణ మార్పును దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ శుద్ధజలాలను తాగాలని మండల వైద్యాధికారి సంతోష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పిహెచ్‌సికి రోజుకు సుమారు 100 వరకు ఒపి వస్తోందన్నారు. ఐదు వరకు వైరల్ జ్వరాల కేసులు నమోదు అవుతున్నాయని చెప్పారు. డెంగీ, మలేరియా జ్వరాలు నమోదు కాకున్నా, అనుమానం ఉన్న రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టైపాయిడ్ కేసులు నమోదవుతున్నట్లు తెలిపారు. వర్షాల వల్ల పాములు పొలాల్లో సంచరిస్తాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిహెచ్‌సిలో పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పిహెచ్‌సి పరిధిలోని తొమ్మిది సచివాలయాల్లోని ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

29న చలో కలెక్టరేట్

చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యకాస నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

బొర్రపనుకువలస, జిల్లేడువలస గిరిజనులకు గతంలో తహశీల్దార్ బాలమురళీకృష్ణ, విఆర్‌ఒలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈ నెల 29న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని జిల్లేడువలస, బొర్రపనుకువలస గ్రామాలలో చలో కలెక్టరేట్ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో సాలూరు తహశీల్దార్‌గా పనిచేసిన బాలమురళీకృష్ణ, విఆర్‌ఒ కృష్ణమూర్తి కేవలం ఒక గ్రామానికి పట్టాలు ఇచ్చి మిగతా వారికి ఇవ్వకుండా గిరిజనుల మధ్య తగాదాలు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గరుగుబిల్లి మండలం శివ్వాంలో దళితులపై దాడి చేసిన పెత్తందారులపై ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇప్పించాలన్నారు. వీటిపై చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సోములు, సీతయ్య, దాస్, గంగయ్య పాల్గొన్నారు.

కాలువలు నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీటిని చూపిస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు, స్థానికులు

పాచిపెంట మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ చిన్నపాటి వర్షం వస్తే తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా చేరుతున్నాయని, ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని చెప్పారు. వెంటనే కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు సాలూరు గిరి ప్రసాద్, ఉప్పల సుదర్శన్ రావు, నిమ్మకాయల అప్పలస్వామి, కొల్ల ప్రభు, బోను గౌరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ వెంకటరమణ మృతికి సంతాపం

సంతాపం తెలియజేస్తున్న సీతంపేట ఎంపిడిఒ, కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

నరసాపురం ఎంపిడిఒ వెంకటరమణ మృతికి జిల్లాలో పలుచోట్ల అధికారులు, సిబ్బంది సంతాపం తెలియజేశారు. పార్వతీపురం ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా ఎంపిడిఒల సంఘం ఆధ్వర్యంలో ఇఒపిఆర్‌డిలు, కార్యదర్శులు నల్ల రిబ్బన్లు ధరించి సంతాపం ప్రకటించారు. పార్వతీపురం ఎంపిడిఒ అకిబ్ జావేద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాలకొండ, సీతానగరం, గరుగుబిల్లి ఎంపిడిఒలు రామకృష్ణ, ఈశ్వరరావు, పి.సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి జి.రమణమూర్తి, కార్యదర్శుల సంఘం అధ్యక్షులు జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఎంపిడిఒ వెంకటరమణ మృతికి సంతాపంగా ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఎంపిడిఒ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కుమార్ వర్మ, ఎపిఒ భాను, జెఇ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : నర్సాపురం ఎంపిడిఒ వెంకటరమణారావు మృతి పట్ల స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, సిబ్బంది సంతాపం తెలియజేశారు. మౌనం పాటించి నివాళులర్పించారు.

సీతంపేట : నరసాపురం ఎంపిడిఒ వెంకటరమణ మృతికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. ఎంపిడిఒ గీతాంజలి, సిబ్బంది కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి మౌనం పాటించారు.

జియ్యమ్మవలస : ఎంపిడిఒ వెంకటరమణ మృతికి జియ్యమ్మవలస ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు, కార్యాలయం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు. వెంకటరమణ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

దర్యాప్తు చేపట్టాలి

పాలకొండ : నర్సాపురం ఎంపిడిఒ మృతిపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడుతూ వెంకటరమణపై ఒత్తిడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

గిరిజనేతరులకు ఉద్యోగాలా?

ఏకలవ్య పోస్టుల భర్తీపై భగ్గుమన్న గిరిజన సంఘాలు

ప్రజాశక్తి-సాలూరు

ఏకలవ్య పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది నియామకంలో గిరిజనేతరులకు మంత్రి సంధ్యారాణి ప్రాధాన్యమివ్వడం అన్యాయమని గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్లా సురేష్, ఇంటి కుప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజు అన్నారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో ఇటీవల రెగ్యులర్ ప్రాతిపదికన బోధన, బోధనేతర సిబ్బంది నియామకం జరిగిందని చెప్పారు. ఈ నియామకాల వల్ల అంతవరకూ పని చేసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో ఎక్కువ మంది గిరిజనులే ఉన్నారని చెప్పారు. వారిని గిరిజన సంక్షేమ శాఖలో మిగిలిన పాఠశాలల్లో నియమించాలని కోరామని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోయిన గిరిజనులు ఉండగా వారిని కాదని ఇద్దరు గిరిజనేతరులను జూనియర్ అసిస్టెంట్లుగా నియామకానికి సిఫార్సు చేశారని ఆరోపించారు. గిరిజనేతరుల సేవలో మంత్రి సంధ్యారాణి తరిస్తున్నారని ఆరోపించారు. సిఎం చంద్రబాబు నాయుడు వెంటనే మంత్రి పదవి నుంచి సంధ్యారాణిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న తెలుగు రైతు అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు వెంకట్‌నాయుడు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతం

ప్రజాశక్తి-కొమరాడ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధికి అవకాశం లభిస్తుందని తెలుగురైతు అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు దేవకోటి వెంకట్‌నాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని విక్రంపురం గ్రామంలో తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రూ.15 వేల కోట్లు మంజూరు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి నిధులను కూడా విడుదల చేయుటకు అంగీకారం తెలపడంతో ఈ ప్రాంతంలో చెక్‌డ్యాములు, ఎత్తిపోతల పథకాలు, గుమ్మలక్ష్మీపురంలోని జీడి ఫ్యాక్టరీ ఏర్పాటుకు మంచి అవకాశమని అన్నారు. అల్లూరి శీతారామరాజు జిల్లాలో కాఫీ తోటలు విస్తారంగా చేయుటకు, సీతంపేట ఏరియాలో గిరిజన పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు.

ఉత్తరాంధ్రలోని ఏజెన్సీ మండలాలు అత్యధికంగా ఉన్నందున వాటి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారి సదుపాయాలపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. గత ఐదేళ్లపాటు అధ్వానంగా ఉన్న రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభిస్తుందని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా నేడు రైతుల కళ్లలో ఆనందం చూస్తున్నామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపిటిసి సభ్యులు గొట్టాపు త్రినాథ, తెలుగు రైతు నాయకులు బద్రి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నిధుల కేటాయింపుపై మాజీ ఎమ్మెల్యే హర్షం

పార్వతీపురంరూరల్ : రాజధాని అమరావతి కోసం రూ.15 వేల కోట్లు సహాయాన్ని ప్రకటించడం పట్ల మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. పోలవరం ప్రాజెక్టు బాధ్యతను కేంద్రం తీసుకోవడం, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

బోసిపోయిన వారపు సంత

కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న గిరిజన వారపు సంత

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో బుధవారం జరిగిన వారపు సంత బోసిపోయింది. సమీప గ్రామాల ప్రజలు గొడుగుల సాయంతో సంతకు వచ్చి కూరగాయలు, వస్తువులు కొనుగోలు చేశారు. వ్యాపారులు, గిరిజనులు వానలో తడుస్తూ అమ్మకాలు సాగించి ఇబ్బందులు పడ్డారు. వారపు సంత ప్రాంతమంతా బురదమయంగా మారింది. పదేళ్ల కిందట నిర్మించిన సంత షెడ్లు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. షెడ్ల సమీపానే గిరిజనులు అటవీ ఉత్పత్తులను తీసుకువచ్చి అమ్మకాలు చేపట్టారు. అధికారులు స్పందించి సంత షెడ్లు వినియోగంలోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.

విద్యతోపాటు క్రీడలు అవసరం

సీతంపేట.. క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిడి అన్నదొర

ప్రజాశక్తి-సీతంపేట

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర తెలిపారు. సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు బుధవారం స్పోర్ట్స్ డేను పాఠశాలలో నిర్వహించారు పోటీలను డిడి ప్రారంభించారు. అనంతరం డిడి మాట్లాడుతూ ఆటపాటలతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తద్వారా చక్కటి చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ పి.నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవి, జిసిడిఒ రాములమ్మ, ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యుఒ పి అమల, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భామిని : ఆదర్శ పాఠశాలలో బుధవారం స్వదేశీ ఆటలను విద్యార్థులు పరిచయం చేశారు. అష్ట -చెమ్మ, దాడి -దిక్కుడి, క్యారంబోర్డు, చదరంగం, గట్టు -చెరువు, చెమ్మ -చెక్క, వప్పుల కుప్ప -వయ్యారి భామ ఆటలను ఆడించారు. స్వదేశీ ఆటలు ఆడితే ఎంతో ఆనందం కలుగుతుందని ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసితోనే సురక్షిత ప్రయాణం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆర్‌టిసి బస్సుల్లోనే సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చని డిపిటిఒ కాశీరాం, ఆర్‌టిసి డిఎం దుర్గాదేవి తెలిపారు. రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు బుధవారం ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిటిఒ మాట్లాడుతూ అతి వేగంతో ప్రయాణించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, వాహన అనుమతి పత్రాలు లేకున్నా కేసులు నమోదు చేసి చర్యలు చేసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

18 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-కొమరాడ

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 18 సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమినాయుడువలస వద్ద పంతులువలసకు చెందిన వారణాసి తవిటిరాజు వాహన తనిఖీల్లో 18 మద్యం సీసాలతో పోలీసులకు పట్టుబడినట్లు ఎస్‌ఐ నీలకంఠం తెలిపారు. మద్యం తరలించడానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.

పనసభద్రలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని పనసభద్ర పంచాయతీలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీలోని దుగ్గేరు, మూలవలస, పనసభద్ర గ్రామాల్లో కాలువలో పూడిక తీసి, దోమలు వ్యాప్తి చెందకుండా స్ప్రేయింగ్ చేశారు.